పుట్ట గొడుగుల్లా గొలుసు దుకాణాలు

- మద్యం షాపుల సమీపంలోనే నాలుగైదు బెల్టు దుకాణాలు
- కూటమి ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఏర్పాటు
- గ్రామాల్లో తాగునీరు లేకపోయినా మద్యం మాత్రం లభ్యం
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు


కంచికచర్లలో మద్యం దుకాణం సమీపంలో వెలసిన గొలుసు దుకాణం

కంచికచర్ల/వీరులపాడు: కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో తెలుగు తమ్ముళ్లు విచ్చలవిడిగా మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. కంచికచర్ల మండలంలో 16 గ్రామాల్లో మొత్తం 54 మద్యం గొలుసు దుకాణాలు వెలిశాయి. వీరులపాడు మండలంలో 22 గ్రామాల్లో 25, నందిగామలో 51, చందర్లపాడు మండలంలో 20 మద్యం బెల్టు షాపులు ఉన్నాయి. కంచికచర్లలో అధికార పార్టీకి చెందిన నాయకుడు ఏకంగా షెడ్డులు నిర్మించి గొలుసు దుకాణం పెట్టాడు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి కుమారుడు రెడీమెడ్ దుకాణం నడుపుతున్నాడు. గొలుసు దుకాణం నడిపేందుకు షాపులు కట్టించి బిర్యాని, మటన్ ఐటమ్స్ మొత్తం రెస్టారెంట్‌లాగా ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యాడు. కంచికచర్ల మండలం కీసర మద్యం దుకాణం వద్ద ఏడు గొలుసు దుకాణాలు వెలిశాయి. ఈ నెలలో అక్రమంగా మద్యం గొలుసు దుకాణాలు పెట్టి మద్యాన్ని విక్రయిస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ బేగం తెలిపారు.

తాగునీరు లేకపోయినా...

మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో తాగునీటి కొరత ఉంటుందేమో కానీ మద్యానికి మాత్రం ఢోకా లేదు. ఆయా గ్రామాల్లో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ధన సంపాదనే ధ్యేయంగా బెల్టు షాపులు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో నాలుగు నుంచి ఐదు దుకాణాల వరకు ఏర్పాటు చేశారు. గతంలో గ్రామ శివారులో మద్యం దుకాణాలుంటేనే మందు బాబులకు అడ్డూ అదుపు లేకుండా పోయేదని, ఇప్పుడు ఏకంగా గ్రామాల్లోనే ఐదారు బెల్టుషాపులు ఏర్పాటు చేస్తుండడంతో పరిస్థితులు ఎలా ఉంటాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మద్యం దుకాణదారులకు కాసుల వర్షం..

కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన మద్యం పాలసీ ద్వారా దుకాణాలు దక్కించుకున్న నిర్వాహకులకు బెల్టుషాపులు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఒక్కో బెల్టుషాపునకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు చెల్లిస్తేనే మద్యం సరఫరా చేస్తామని మద్యం దుకాణాల నిర్వాహకులు చెబుతున్నా బెల్టుషాపుల్లో సంపాదన అధికంగా ఉండటంతో నగదు చెల్లించేందుకు వెనుకాడటం లేదని చెబుతున్నారు. జుజ్జూరులో ఏడు బెల్టుషాపులు ఏర్పాటు చేసేందుకు ఒక్కొక్కరి వద్ద ఆరు నెలలకు గాను రూ.50 వేలు మద్యం దుకాణ యజమాని వసూలు చేసినట్లు సమాచారం.

మద్య నియంత్రణకు తూట్లు..

గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్యపాన నియంత్రణకు తీసుకున్న చర్యలకు ప్రస్తుత ప్రభుత్వం తూట్లు పొడుస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా గత ప్రభుత్వంలో గ్రామాలకు శివారున మద్యం దుకాణాలు ఏర్పాటు చేయటంతో పాటు పరిమిత వేళల్లోనే మద్యం విక్రయాలు జరిగేవి. ప్రస్తుత ప్రభుత్వం జనావాసాల మధ్య దుకాణాలు ఏర్పాటు చేయడమే కాక, సమయపాలన కూడా పాటించటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. బెల్టుషాపులను నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖాధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను గ్రామ శివారుకు తరలించటంతో పాటు గ్రామాల్లో బెల్టుషాపుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల మహిళలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నందిగామ ఏసీపీగా తిలక్



నందిగామటౌన్: నందిగామ ఏసీపీగా తిలక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏసీపీగా బాధ్యతలు నిర్వహించిన రవి కిరణ్ బదిలీ కావటంతో ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ నుంచి బదిలీపై తిలక్ ఇక్కడకు వచ్చారు. ఏసీపీ రవికిరణ్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది నూతన ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ తిలక్ మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అనుసరిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు వైవీఎల్ నాయుడు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



లింగగూడెం(పెనుగంచిప్రోలు): గ్రామంలో శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి వారి పడిపూజా కార్యక్రమం నారిశెట్టి శ్రీనివాసరావు స్వామి 18వ పడి సందర్భంగా సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన మండపంపై శ్రీగణేష్, కుమారస్వామి, అయ్యప్పస్వాముల వారి చిత్ర పటాలను ఉంచి గురుస్వామి వాసిరెడ్డి బెనర్జీ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను కేరళకు చెందిన మురుగన్ స్వామి నిర్వహించారు. అనంతరం కోదాడకు చెందిన గోపాలకృష్ణ బృందం భజన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీరంగనాయకస్వామి ఆలయంలో లక్ష తులసి పూజ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీరంగనాయకస్వామి ఆలయంలో మంగళవారం కార్తిక శుక్ల ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విష్ణుసహస్ర నామ పారాయణం, లక్ష తులసి పూజ నిర్వహించారు. మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం జరిగింది.

పేటలో 2కె రన్

జగ్గయ్యపేట: పట్టణంలోని తపోవన్ విద్యాలయంలో మూడు రోజుల పాటు జరగనున్న స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత మున్సిపల్ సెంటర్ నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు కోదాడ రోడ్డులోని పాఠశాల వరకు 2కె రన్ నిర్వహించారు. రన్‌ను ఏఎస్ఐ బేబిరాణి, పాఠశాల విద్యా కమిటీ సభ్యుడు రాధాకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధీర్‌బాబు, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ హరీష్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

తెలంగాణకు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా


ఆళ్లూరుపాడు రేవు వద్ద అర్ధరాత్రి పట్టుకున్న టిప్పర్ వద్ద చిన్నా, ఎంపీపీ రమాదేవి

వత్సవాయి: మండలంలోని ఆళ్లూరుపాడు, ఇందుగపల్లి, లింగాల రేవుల నుంచి అక్రమంగా ఇసుకను తెలంగాణకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి చిన్నా, ఎంపీపీ కొలుసు రమాదేవి ఆరోపించారు. సోమవారం అర్ధరాత్రి ఆళ్లూరుపాడు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం తెలుసుకుని ఎంపీపీ రమాదేవి, ఇంటూరి చిన్నా రేవులో ఉన్న టిప్పర్ల వద్దకు వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో ఇసుకను ఎందుకు తరలిస్తున్నారని అడిగితే వారి వద్ద నుంచి సమాధానం లేదు. వారి వద్ద ఎటువంటి రశీదులు లేవు. సామాన్యులు నిర్మాణాలకు ఇసుకను తోలుకుంటే వెంటనే వారిపై కేసులు నమోదు చేసే పోలీసులు నియోజకవర్గ పెద్దలు అక్రమంగా టిప్పర్లతో రాత్రి సమయంలో తెలంగాణకు తరలిస్తున్నా పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. రెవెన్యూ, పోలీసుల కనుసన్నల్లోనే అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోందని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టకపోతే ఉద్యమం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

గ్రామాల్లో కుక్కల స్వైర విహారం


గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు


కుక్కల దాడిలో చనిపోయిన ప్రేమ్‌కుమార్(ఫైల్)

పెనుగంచిప్రోలు: గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఏ గ్రామంలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు ఒక్క చోటకు చేరి హల్‌చల్ చేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో అవి వాహనాల వెంటపడుతుండటంతో భయంతో వాహనదారులు కింద పడిపోయి గాయాలపాలవుతున్నారు. తాజాగా పెనుగంచిప్రోలులోని తుఫాన్ కాలనీలో సోమవారం రాత్రి బాలతోటి గోపాలరావు, నాగమణి దంపతులకు లేకలేక పదేళ్లకు పుట్టిన ప్రేమ్‌కుమార్ అనే రెండేళ్ల బాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా 10 కుక్కలకు పైగా దాడి చేసి సమీపంలోని పొలాల్లోకి ఈడ్చుకెళ్లి తీవ్రంగా గాయపరచటంతో చనిపోయాడు. దీంతో ఆ దంపతుల రోదన వర్ణనాతీతంగా ఉంది. ప్రభుత్వాసుపత్రిలో కుక్కల దాడులకు పదుల సంఖ్యలో గాయపడిన వారు వస్తున్నారని వైద్యులు అంటున్నారు. గ్రామాల్లో సైతం ఈ కుక్కల బెడద ఉందని ప్రజలు వాపోతున్నారు.

ఎక్కడ చూసినా గుంపులే...

మండల కేంద్రం పెనుగంచిప్రోలులో ముఖ్యంగా భక్తులు తిన్న తరువాత మాంసం వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను కుక్కలు తిని అనంతరం మనుషులపై దాడులకు తెగబడుతున్నాయి. గుంపులుగా సంచరిస్తూ తీవ్ర భయాందోళనలు సృష్టిస్తున్నాయి.

కుక్కలకు వైరస్...

కుక్కలకు శరీరంపై చర్మం ఊడిపోయి పుళ్లు పడి ఎండుకుపోయి చనిపోతున్నాయి. దీనిని ఒక రకమైన వైరస్ అని, దీనికి ముందస్తుగా కుక్కలకు వ్యాక్సిన్ ఇప్పించాలని పశువైద్యులు అంటున్నారు. కుక్కల దాడిలో చనిపోయిన ప్రేమ్‌కుమార్ తల్లిదండ్రులకు గ్రామానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు స్వామి మురళి మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న పొక్లెయిన్ సీజ్


సీజ్ చేసిన పొక్లెయిన్‌తో తహసీల్దార్ శాంతిలక్ష్మి

సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): మండలంలోని సుబ్బాయిగూడెంలో పెనుగంచిప్రోలు–1 ఇసుక రీచ్‌లో అక్రమంగా తవ్వకాలు చేస్తున్న పొక్లెయిన్‌ను మంగళవారం అధికారులు సీజ్ చేశారు. అక్రమ రవాణాపై సమాచారం అందుకున్న తహసీల్దార్ శాంతిలక్ష్మి తన సిబ్బందితో వెళ్లి అక్రమంగా ఇసుక లోడ్ చేస్తున్న పొక్లెయిన్‌ను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవన్నారు. ఆర్ఐ అబ్దుల్ హలీమ్, వీఆర్వో చైతన్య పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని విజయవాడ రోడ్‌లో ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశి సందర్భంగా వ్రత కాలంలో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారికి వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు.

15 న దీపోత్సవం

జగ్గయ్యపేట అర్బన్: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా స్థానిక నకాశిబజారులో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఈనెల 15 వ తేదీ కార్తిక పౌర్ణమి రోజున దీపోత్సవం వేడుకలు జరుగుతాయని శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానం ఇంప్రూవ్‌మెంట్ ప్రైవేటు కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు రుద్రాభిషేకం, 6.30 గంటలకు జ్వాలాతోరణం, రాత్రి 7.30 గంటలకు దీపోత్సవం వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేలం పాటలు వాయిదా

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో పలు వేలం పాటలు వాయిదా పడినట్లు ఏసీ వరప్రసాద్ మంగళవారం పేర్కొన్నారు. కొండపై పలు రకాల లైసెన్స్ హక్కులకు వేలం పాటలు నిర్వహించాల్సి ఉండగా పాటదారులు రాకపోవటంతో వాయిదా వేసినట్లు చెప్పారు.

అంగన్‌వాడీ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

నందిగామటౌన్: నందిగామ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగనవాడీ కేంద్రాలలో ఖాళీ పోస్టుల దరఖాస్తుదారులకు మంగళవారం ఆర్డీవో బాలకృష్ణ ఇంటర్వ్యూలు నిర్వహించారని సీడీపీవో భాగ్యరేణుక తెలిపారు. మినీ కార్యకర్త, ఎనిమిది మంది సహాయకుల పోస్టులకు గాను 28 దరఖాస్తులు వచ్చాయని, వీరిలో ఇంటర్వ్యూలలో ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేస్తారని తెలిపారు.

బాలుడి కుటుంబ సభ్యులకు తన్నీరు పరామర్శ


పేట ప్రభుత్వాస్పత్రిలో ప్రేమకుమార్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 11 వ తేదీ రాత్రి పెనుగంచిప్రోలు తుపాను కాలనీలో వీధి కుక్కల దాడిలో మృతి చెందిన 2 ఏళ్ల బాలుడు బాలతోటి ప్రేమకుమార్ కుటుంబ సభ్యులను మంగళవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు పరామర్శించారు. తొలుత ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, బీసీ సెల్ నాయకుడు చావల వెంకటేశ్వర్లు తదితరులతో కలసి ప్రభుత్వాస్పత్రిలో ఉన్న ప్రేమకుమార్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వీధి కుక్కల నివారణకు పురపాలక సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు.

కుక్కల నుంచి ప్రజలకు ప్రాణరక్షణ కల్పించాలి


మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కౌన్సిలర్ మనోహర్

జగ్గయ్యపేట అర్బన్: రోజురోజుకు పట్టణంలో వీధి కుక్కలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, పిల్లలు, వృద్ధులు, మహిళలపై తరచూ దాడిచేసి కరుస్తున్నాయని, వాటి నుంచి పట్టణ ప్రజలకు ప్రాణరక్షణ కల్పించాలని 5 వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావును కలిసి ఈమేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈనెల 11 వ తేదీన పెనుగంచిప్రోలు గ్రామంలోని తుపాను కాలనీలో రెండేళ్ల బాలుడు కుక్కల దాడిలో మరణించడం దారుణమన్నారు. ఇలాంటి ఘటన మరొకటి జరిగితే అందుకు పూర్తి బాధ్యత మున్సిపాలిటీ వారే వహించాల్సి ఉంటుందన్నారు.

నేరస్తుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న నేరస్తుడి ఆచూకీ కోసం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు జిల్లా వ్యాప్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లాలోని చందర్లపాడు గ్రామానికి చెందిన కొల్లి అమర్‌నాథ్(45)పై విజయవాడ ఆరవ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు నమోదై ఉంది. ఈ కేసులో ఏ–3 అయిన అమర్నాథ్ కొంత కాలంగా వాయిదాలకు హాజరుకావడం లేదు. దీంతో కోర్టు అతన్ని నేరస్తుడిగా పరిగణించింది. నెల రోజుల్లోపు న్యాయస్థానంలో గాని, విజయవాడ అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో గాని లొంగిపోవాలని ఆదేశించింది.
నేరస్తుడైన అమర్‌నాథ్ ఆచూకీ తెలిసిన వారు అజిత్ సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్ ఫోన్ 94406 –27037, 83410–51000 నంబర్లకు తెలియజేయాలని సీఐ బీహెచ్ వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

కంచికచర్ల: ఆన్‌లైన్‌లో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అత్యాసకు పోయి ఉన్న డబ్బులను పోగొట్టుకోవద్దని ఎస్ఐ బోనగిరి రాజు అన్నారు. ఆన్‌లైన్‌లో మోసపోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు కంచికచర్లకు చెందిన పోలిశెట్టి సాంబశివరావు అనే యువకుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. దీపావళి పండుగ సందర్భంగా స్వగ్రామమైన కంచికచర్ల వచ్చాడు. అదేరోజు తన వాట్సాప్‌కు వర్టెక్స్ జనరేషన్ డిజిటల్ కంపెనీ, సిక్స్ స్వీప్ ఎక్స్ఛేంజ్ అని చెప్పి ఆన్‌లైన్ టాస్క్ చేస్తే డబ్బులు వస్తాయని మెసేజ్ వచ్చినట్లు తెలిపారు. సాంబశివరావు ఆ మోసాన్ని గ్రహించక తన బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న రూ.6లక్షలు తన అకౌంట్‌నుంచి పంపాడు. కాని ఆ డబ్బులు తిరిగి రాకపోవటంతో మోసపోయానని గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా

కంచికచర్ల: మండలంలోని ముత్తవరపు వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ కళాశాలలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సౌజన్యంతో మెగా జాబ్ మేళా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యు.ఏడుకొండలు మంగళవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో 50 కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారని నాలుగువేలమంది నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారన్నారు. మంచి ప్రతిభ, స్కిల్స్ కనపర్చిన 500 మందికి ఉద్యోగావకాశాలు లభించాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎం.శ్రీనివాసబాబు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎం.రామకృష్ణ, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికల తయారీపై శిక్షణ

పెనుగంచిప్రోలు: పంచాయతీరాజ్ వ్యవస్థలో ప్రణాళికలు తయారు చేయటంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న ఎంపీపీ, జెడ్పీటీసీ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, అనిగండ్లపాడు, ముచ్చింతాల, పెనుగంచిప్రోలు, గుమ్మడిదుర్రు గ్రామైక్య సంఘాల అధ్యక్షులకు శిక్షణ ఇస్తారన్నారు. 14న మండల స్థాయి అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, మిగిలిన వీఓ ప్రెసిడెంట్లకు శిక్షణ ఉంటుందన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

నందిగామటౌన్: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ తరగతులలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పక పాల్గొనాలని చెప్పారు.

గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీపై నేడు శిక్షణ తరగతులు

కంచికచర్ల: మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వీఓ ప్రెసిడెంట్లకు ఈనెల 13,14 తేదీలలో రెండు రోజుల పాటు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ శిబిరంలో ఆయా గ్రామ ప్రజా ప్రతినిధులు, అధికారులకు గ్రామ అభివృద్ధి ప్లాన్ తయారు చేసేందుకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ జరుగుతుందన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ తరగతులకు గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై కరెంట్ ఆఫీస్ ముట్టడి

కంచికచర్ల: తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని కూటమి నాయకులు అన్నారని, అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కాకముందే అధికంగా విద్యుత్ చార్జీలు పెంచి వినియోగదారులను మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మందా వజ్రయ్య అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచినందుకు నిరసనగా మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ముందుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొటారు రవికుమార్, నాయకులు పూర్ణచంద్రరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ నెల 14న ప్రజా వేదిక

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 14న ఉపాధి హామీ పథకం బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నితిన్ మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ప్రజావేదికలో మండలంలోని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని చెప్పారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు..

గ్రామాభివృద్ధి ప్రణాళికపై ఈ నెల 13,14 తేదీలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నితిన్ చెప్పారు.

ఓటీపీ నిబంధన ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

జగ్గయ్యపేట అర్బన్: ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో ఉపయోగించే నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లను కొనుగోలు చేయాలంటే కొనుగోలుదారునికి ఫోన్‌కు ఓటీపీ చెప్పాలనే ప్రభుత్వ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని జగ్గయ్యపేట దస్తావేజుల లేఖరుల సంఘం అధ్యక్షుడు మాడపాటి కిషోర్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టాంపు ఇచ్చే సమయంలో స్టాంప్ వెండర్లకు పనిభారం అవుతుందని తెలిపారు. స్టాంపు విక్రయించే సమయంలో కంప్యూటర్ ప్రింటర్ స్కానర్ ఇంటర్‌నెట్ కనెక్షన్ తప్పనిసరి అవుతుందన్నారు. కక్షిదారులను, వెండర్లను దృష్టిలో పెట్టుకుని పాత పద్ధతిలోనే రికార్డులు నమోదు చేసుకునే విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

వీరులపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అనిల్ హెచ్చరించారు. మండలంలోని అల్లూరు గ్రామ సమీపంలో మంగళవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపినా ఉపేక్షించేది లేదన్నారు. ఆటోవాలాలు పరిమితి మేరకే ప్రయాణికులను ఎక్కించాలని సూచించారు.